క్లుప్తంగా

కనులపండువగా నత్తల పరస



ఇసుకతోట పరసలో గృహోపకరణాల విక్రయాలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలో నత్తల పరసను శనివారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన నంది ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు చేశారు. సాయంత్రం పరసలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు గృహోపకరణాలను విక్రయించారు. ఈ సందర్భంగా గ్రామం మధ్యలో ఉన్న రామాలయాన్ని, నంది ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఈ ప్రాంతమంతా కళకళలాడింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాము గరిడీ, కోలాటం, నేలవేషాలు, బుర్రకథ అలరించాయి.

ఏయూ హిందీ విభాగం పరిశీలన



గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగాన్ని శనివారం సాయంత్రం సందర్శించారు. లోక్ నాయక్ ఫౌండేషన్ అవార్డు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ముందుగా హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీ భరత్ తదితరులు

ఏయూక్యాంపస్: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు నివాళులు అర్పించారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్, భీమిలి ఎమ్మెల్యే, గంటా శ్రీనివాస రావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, సీతంరాజు సుధాకర్, గండి బాబ్జీ తదితరులు నివాళులు అర్పించారు.

ఆరిలోవ: తొమ్మిదో వార్డులో కూటమి నాయకులు విశాలాక్షినగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వేజెల్ల సుబ్బరాజు, రాంబాబు, సుజాత, నాగలక్ష్మి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. పదో వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లో, పదకొండో వార్డులో పాత ఆరిలోవలో వర్ధంతి నిర్వహించారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

భీమునిపట్నం: నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం భీమిలి పరిధిలో నిర్వహించిన పరీక్షకు 414మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి శివరాణి తెలిపారు. ఇక్కడ మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 545మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 414మంది హాజరయ్యాయని తెలిపారు. 131మంది గైర్హాజరయ్యారని తెలియజేశారు.

నిర్లక్ష్యమే శాపం



ముడసర్లోవ వెనుక రోడ్డు మధ్యలోనే డంప్ చేసిన డెబ్రిస్

- నిరుపయోగంగా ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లు
- కొన్నేళ్లుగా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- రోడ్లకు ఇరువైపులా డెబ్రిస్, తుప్పలతో ఇబ్బందులు

ఆరిలోవ : జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లకు శాపంగా మారింది. ఇక్కడ కొన్నేళ్ల క్రితం విశాలమైన డబుల్ రోడ్లు నిర్మించారు. ఎంతో ప్రశాంతమైన వాతావరణానికి ఈ ప్రాంతం మారు పేరు. చుట్టూ పచ్చని కొండలు, విశాలమైన రోడ్లు ఉండడంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. దీంతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం అధిక సంఖ్యలో వృద్ధులు, యువకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఇక్కడి విశాలమైన రోడ్లు, పక్కన ఖాళీ మైదానాల్లో క్రికెట్, వాలీబాల్ తదితర ఆటల కోసం వచ్చి సందడి చేస్తుంటారు. ప్రస్తుతం ఆ రోడ్లు గృహ వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల పిచ్చి మొక్కలతో పూర్తిగా దారి లేకుండా మూసుకుపోయాయి. దీంతో వాహనాల రాకపోకలు జరగాల్సిన ఆ రోడ్లు డెబ్రిస్, పిచ్చి మొక్కలుతో మూతపడి నిర్మానుష్యంగా మారాయి. ఇక్కడ రోడ్లపై కొందరు గృహ వ్యర్థాలను లారీలతో తీసుకొచ్చి డంప్ చేసేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆ డెబ్రిస్ రోడ్ల మధ్యలోనే కుప్పలుగా వేయడంతో ఇరుకుగా మారాయి. దానికితోడు రోడ్లకు ఇరుపక్కలా, డివైడర్లపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కొన్నిచోట్ల మూసుకుపోయాయి. దీంతో ఆ రోడ్లపై వాహనచోదకులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రైల్వే జోన్ కోసం కేటాయించిన 52 ఎకరాల స్థలానికి వెళ్లాల్సిన దారి కూడా ఈ రోడ్డే కావడం విశేషం. మరో పక్క రోడ్డుకు ఇరు పక్కాలా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, డివైడర్ల మధ్యలో పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ఇవి పాములకు ఆవాసాలుగా మారాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన విశాలమైన రోడ్ల నిర్వహణను జీవీఎంసీ అధికారులు గాలికొదిలేయడంతో వినియోగానికి ఉపయోగపడకుండా పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డబుల్ రోడ్డు మధ్య డివైడర్‌పై తుప్పలు



రోడ్డుకు ఇరువైపులా డెబ్రిస్ డంప్ చేయడంతో మూసుకుపోయి ఇరుకుగా మారిన డబుల్ రోడ్డు

సీపీఆర్‌పై అవగాహన అవసరం

జేసీఐ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చరిష్మ

ఏయూక్యాంపస్: ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ కృషి చేయాలని జేసీఐ వైజాగ్ అధ్యక్షురాలు డాక్టర్ చరిష్మ కోరారు. శనివారం ఉదయం విక్టరీ ఎట్ సీ వద్ద బీచ్ వాకర్స్‌కు ఉచిత ఆరోగ్య పరీక్షలు, సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై అవగాహన పెంచడం, విషమ పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడటం ప్రధానంగా శిబిరం నిర్వహించామన్నారు. డాక్టర్ చరిష్మ కార్డియో పల్మనరీ రెసిటేషన్(సీపీఆర్)పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేసే విధానాలను వివరించారు. ప్రతీ వ్యక్తి దీనిని నేర్చుకోవాలని సూచించారు. డాక్టర్ అమృత తిలక్, డాక్టర్ కుమార్ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేశారు. వాకర్స్‌కు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో పాస్ట్ జోన్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ బొట్టా, జోన్ ఆఫీసర్ కిరణ్ పోలిపల్లి, పూర్వ అధ్యక్షుడు జె.సి.బ్రహ్మాజీ, జె.సి. శ్రీ కావ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజ స్వామి ఊరేగింపులో భక్తులు, నిర్వాహకులు

మద్దిలపాలెం : త్యాగరాజస్వామి 178వ వర్ధంతి సందర్భంగా కళాభారతిలో రెండో రోజు త్యాగరాజ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు శ్రీరాముల వారికి త్యాగరాజస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామ పరివారాన్ని పల్లకీలో పెట్టి భక్తులు త్యాగరాజ కృతులను ఆలపిస్తూ ఘనంగా ఊరేగించారు. ఈ ఉత్సవంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరు రాంబాబు త్యాగరాజ వేషధారణ అందరినీ ఆకర్షించింది. గురివిల్ల అప్పన్న చక్కటి నాదస్వరం అందించారు. కోలాటం చేస్తూ కళాభారతి చుట్టూ ఉన్న వీధిలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఘనరాగ పంచరత్న కృతులు బృంద గానంలో 200 మందికి పైగా కళాకారులు పాల్గొన్ని ఆలపించారు. 'సంగీత కళాభారతి గురివిల్ల అప్పన్న 30 నిమిషాలు నాదస్వర కచేరీతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ద్వారం దుర్గాప్రసాద్ వయోలిన్ కచేరీ అత్యంత అద్భుతంగా సాగింది. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్ రాజు, కోశాధికారి రామ్ గోపాల్, లలితా చంద్రశేఖర్, ఎంఎస్ఎన్ మూర్తి, వంకాయల వెంకటరమణ, ఎం.ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గొడుగు' కొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు శివరామకృష్ణ

ఎంవీపీ కాలనీ : గొడుగు వాకర్స్ అసోసియేషన్‌కు కొత్తగా ఎన్నికైన కార్యవర్గం శనివారం బాధ్యతలు స్వీకరించింది. శివాజీపార్కులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికై న నూతన అధ్యక్షుడు కె.శివరామకృష్ణతోపాటు ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్.రామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ, కోశాధికారి ఎం.నందకుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఇంటర్నేషనల్ వాకర్స్ ప్రెసిడెంట్ ఏహెచ్ఎస్ వెంకట్రావు అతిథిగా పాల్గొని వారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా గతేడాది కంటే అత్యధికంగా అసోసియేషన్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నూతన అధ్యక్షుడు శివరామకృష్ణ వెల్లడించారు.

ఏఎంసీ ఉమెన్స్ హాస్టల్‌లో చోరీ

- నాలుగు ఫోన్లు తస్కరించిన యువతి
- ఆమెను పట్టుకుని సెల్ ఫోన్లు లాక్కున్న విద్యార్థినులు



ఆంధ్రా మెడికల్ కళాశాల ఉమెన్స్ హాస్టల్

దాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్లో దొంగలు పడ్డారు. విలువైన నాలుగు సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడ్డ యువతి వైద్య విద్యార్థినిగా హాస్టల్‌లోకి ప్రవేశించింది. సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతున్న దృశ్యాన్ని పలువురు వైద్య విద్యార్థినులు పసిగట్టి.. ఆ యువతి నుంచి సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ఆంధ్రా మెడికల్ కళాశాల ఉమెన్స్ హాస్టల్‌లోకి రంగిరీజు వీధికి చెందిన ఓ యువతి వైద్య విద్యార్థినిగా లోపలికి చొరబడింది. హాస్టల్‌లోని పలు గదులను చెక్ చేసుకుంటూ విద్యార్థినులు లేని గదుల్లోకి ప్రవేశించి సెల్ ఫోన్లు దొంగలించింది. ఆ యువతి సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతుండడంతో పలువురు వైద్య విద్యార్థినులు అప్రమత్తమై ఆ యువతిని పట్టుకున్నారు. దొంగలించిన నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూరిటీ సిబ్బంది ఎక్కడ?

ఆ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నట్టా? లేనట్టా? అనేది అనుమానంగా ఉంది. సెల్‌ఫోన్లు దొంగిలించేందుకు ఓ యువతి హాస్టల్‌లోకి వెళ్లాలంటే అక్కడ విధులు నిర్వర్తించే ఓ మహిళా సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. అటువంటిది అక్కడ ఉన్న మహిళా సెక్యూరిటీని తప్పుదోవ పట్టించిందో.. లేదా వైద్య విద్యార్థినిగా లోపలికి ప్రవేశించిందో తెలియదు గానీ.. ఆ యువతి హూందాగా వెళ్లి.. సీసీ కెమెరా ద్వారా దొరికిపోయింది.

నో ప్లాస్టిక్ జోన్‌గా రుషికొండ బీచ్

జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి తదితరులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం, బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నో ప్లాస్టిక్ జోన్‌గా మార్చాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి పిలుపునిచ్చారు. బీచ్ వద్ద శనివారం నిర్వహించిన 'ప్లాస్టిక్ రహిత – పర్యావరణ సహిత' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బీచ్ వద్ద ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాల వలన వచ్చే విషవాయువులు జీవన శైలిని విచ్ఛిన్నం చేస్తాయని, అదేవిధంగా సముద్రంలో తాబేళ్లు, చేపలు వంటి జీవులు కూడా విచ్ఛిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ దుకాణదారులు అందరూ ప్లాస్టిక్‌ను కచ్చితంగా నిషేధించాలని సూచించారు. ఇతర దేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం ఇవ్వాలని, ఎకో టూరిజం నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బామిరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో పడవేయడంతో సముద్ర జీవరాశులు నశిస్తున్నాయని, వాటిని పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డీఎం జగదీశ్, సబ్ డీఎఫ్ఏ శివాని, జీవీఎంసీ స్వచ్ఛత ప్రమోటింగ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత

- వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్
- కార్యాలయాల్లో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్'



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

మహారాణిపేట: స్వచ్ఛత మనందరి బాధ్యత అని వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ఇళ్లు, కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ' స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఉద్యోగులతో ఆయన స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ విశాఖకు అందరూ సహకరించాలని కోరారు. ఇకపై ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది, స్థానిక నాయకులు స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో పాల్గొని పరిసరాలు శుభ్రం చేశారు.

- ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో ఈవో కె.వరహాలు ఆధ్వర్యంలో సిబ్బంది, రైతులు, వ్యాపారులు ఆవరణను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. రైతు బజార్ సహాయకుడు జి.కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని లెండీ వనంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పార్కులో చెత్త చెదారం తొలగించారు.



ఎంవీపీ రైతు బజార్ ఆవరణలో..

సంక్షేమ భవన్‌లో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్ ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. భవనం ఆవరణను శుభ్రం చేశారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, బీసీ సంక్షేమశాఖ డీడీ శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ పార్కులో..

మహారాణిపేట: సెంట్రల్ పార్క్‌లో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంయుక్త కమిషనర్ మరియు కార్యదర్శి రమేష్, ముఖ్య ప్రణాళికాధికారి శిల్ప, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగితపు సంచులను పంపిణీ చేశారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జిల్లా ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయ సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు.

విమ్స్‌లో..

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, వైద్యులు, సిబ్బంది చీపుర్లు పట్టుకొని ఆవరణలో చెత్త ఊడ్చారు. పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆస్పత్రి వాతావరణం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా సిబ్బంది చూడాలని కోరారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు కూడా సహకరించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర దివస్ కమిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో..

మద్దిలపాలెం: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో డిపో అసిస్టెంట్ మేనేజర్ మాధురి, స్టేషన్ మేనేజర్ కె.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది ఆవరణను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర చెత్త చెదారాన్ని తొలగించారు.



శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి



సంక్షేమభవన్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీడీ రామారావు



కాగితపు సంచులను పంపిణీ చేస్తున్న ప్రణవ్ గోపాల్, విశ్వనాథన్, తదితరులు



డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



విమ్స్ ఆవరణలో శుభ్రం చేస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, సిబ్బంది



మద్దిలపాలెం బస్ స్టేషన్ ఆవరణలో ..

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభించి నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: జనక్రాంతి ట్రస్ట్ సహకారంతో దాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నడిచే కేంద్రాల్లో శిక్షణ పొందడం వల్ల నైపుణ్యంతో పాటు పోటీ ప్రపంచానికి కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా అందుతుందన్నారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ జనక్రాంతి ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ శివప్రసాద్ శిక్షణ తరగతులకు కావల్సిన రూ.10 లక్షల విలువ గల కంప్యూటర్స్‌ను అందజేశారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకుడు ఎల్లాజీ మాట్లాడుతూ ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్, అకౌంటింగ్, మల్టీ మీడియా వంటి సోషల్ మీడియాకు సంబంధించిన కోర్సులు నామమాత్రపు రుసుంతో రోజుకు 4 షిఫ్టుల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ నిర్వహణ బాధ్యులు జీఎస్ రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, కామేశ్వరరావు, ఎమ్మారెడ్డి రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

దాబాగార్డెన్స్: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఇల్లందు పటేల్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన 80వ ఆనంద మేళోత్సవాల్లో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎవరు నిష్కామ కర్మతో భగవన్నామ సంకీర్తన చేస్తారో వారికి దైవానుగ్రహంతో పాటు అంతిమంలో మోక్షం కలుగుతుందని తెలిపారు. ప్రేమమూర్తుల కృప భక్తులపైన, మనందరిపైన వర్షించాలన్నారు. కుసుమ హరనాథుల ప్రచార సంస్థచే నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజశేఖర్ సంకీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.